క్లుప్తంగా

అంకితభావంతో పని చేయాలి

జీపీఓలకు తహసీల్దార్ కమలాద్రి హితవు



విధుల్లో చేరిన జీపీఓలు

శివ్వంపేట(నర్సాపూర్): నూతనంగా నియామకమైన గ్రామ పాలన అధికారులు (జీపీఓ) విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని తహసీల్దార్ కమలాద్రి అన్నారు. శివ్వంపేట మండలానికి నూతనంగా నియమితులైన పలువురు జీపీఓలు గురువారం విధుల్లో చేరారు. వారికి కేటాయించిన గ్రామాల్లో భూ సమస్యలు, ప్రజల ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జీపీఓలపై ఉందన్నారు. మండలంలోని 11 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి ఇప్పటి వరకు ఆరు మంది విధుల్లో చేరినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐ కిషన్, జీపీఓలు యాదగిరి, జంగం నరేష్, సాయిబాబా, ఎం నరేష్, తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా పెంటాగౌడ్



పెంటాగౌడ్



మనోహర్‌రావు

చేగుంట(తూప్రాన్): ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలశాఖ అధ్యక్ష కార్యదర్శులుగా పెంటాగౌడ్, మనోహర్‌రావు, కోశాధికారిగా సలీం, జిల్లా కార్యదర్శులుగా పాండు, నర్సింలు, సత్యనారాయణ, సిద్ధిరాములు, జగన్‌లాల్, మహిళ అధ్యక్ష కార్యదర్శులుగా వాణి, స్వప్నలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల పరిశీలకులుగా జిల్లా నాయకులు పోచయ్య, శివప్రసాద్ వ్యవహరించారు.

బీజేపీలో చేరిక



శైలజకు కండువా కప్పుతున్న రఘునందన్

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రానికి చెందిన మహిళా సంఘం నాయకురాలు పోచమ్మల శైలజ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన, మెదక్ ఎంపీ రగునందన్ రావు సేవలకు ఆకర్షితురాలై బీజేపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి బీజేపీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, రమేష్, గణేష్ పాల్గొన్నారు.

కాసంపల్లి చెరువు తూముకు గండి



కాసంపల్లి చెరువుకు గండి పడి వృథాగా పోతున్న నీరు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలోని కాసంపల్లి చెరువు తూముకు గండిపడింది. దీంతో చెరువులోని నీరంతా వృథాగా పోతోంది. గురువారం చెరువు కింద పంట పొలం వద్దకు వెళ్లిన స్థానిక రైతు చెరువు నుంచి నీరు వృథాగా పోతున్న విషయం గమనించి కాలువ వెంబడి పరిశీలించగా తూముకు గండిపడినట్లు గుర్తించారు. విషయం గ్రామపెద్దల దృష్టికి తీసుకెళ్లగా.. వారు అధికారులకు సమాచారం అందించి తూము గండిని పూడ్చాలని కోరారు.

గురుకుల పాఠశాల పరిశీలన



పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మునిపల్లి(అందోల్): లింగంపల్లి గురుకుల పాఠశాలను ఎమ్మార్పీఎస్ నాయకులు విజయ్ ప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో గురువారం జిల్లా అధ్యక్షుడు మైసగళ బుచ్చేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల శిథిలాలను పరిశీలించి ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడడం బాధాకరమన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

నత్తనడకన కల్వర్టు పనులు

- ప్రయాణికుల పాట్లు
- త్వరగా నిర్మాణం పూర్తి చేయాలి



నందిగామలో తాత్కాలిక రోడ్డు నిర్మాణ పనులు

నిజాంపేట(మెదక్): భారీ వర్షాల కారణంగా రోడ్లు దెబ్బతిని పక్షం రోజులు కావస్తున్నా నేటికి మరమ్మతుకు నోచుకోకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెదక్ - సిద్దిపేట వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మెదక్ - సిద్దిపేట జాతీయ రహదారి 765 డీజీలో భారీ వర్షాల కారణంగా మండలంలోని నందిగామ గ్రామశివారులో వంతెన కుంగడంతో ఈ రోడ్డు రాకపోకలు ఆగిపోయ్యాయి. దీంతో ప్రతి రోజు వేల సంఖ్యలో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్దిపేట నుంచి మెదక్‌కు ప్రతి రోజు ఉపాధ్యాయులు, వ్యాపారస్తులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తిరుగుతుంటారు. ఈ రోడ్డు కుంగడంతో రవాణా పూర్తి దెబ్బతిన్నది. నందిగామ గ్రామ శివారులోని కల్వర్టు పునర్ నిర్మించాలంటే చాలా సమయం పడేటట్లు ఉంది. అందుకోసం తాత్కాలిక రోడ్డు మరమ్మతు నిర్మాణ కోసం జాతీయ రహదారి కాంట్రాక్టర్ తాత్కాలిక పక్కనే మరో రోడ్డు నిర్మిస్తున్నారు. తాత్కాలిక రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు జిల్లాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. అలాగే నిజాంపేట నుంచి నస్కల్ వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసం కావడంతో ఆలస్యంగా ప్రారంభమై తాత్కాలిక రోడ్డు కోసం మట్టిని పట్టా భూమిని తీస్తున్నారని దరఖాస్తు రావడంతో మధ్యంతరంగా నిలిచిపోయింది.

బస్సులు రాక ఇబ్బందులెన్నో..

ఈ రోడ్డులో దెబ్బతిన్నడంతో బస్సులు బంద్ అయ్యాయి. సిద్దిపేట నుంచి వెళ్లే వారికి బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. సిద్దిపేట నుంచి మెదక్ రావాలంటే మామూలు



నస్కల్ వెళ్లే రహదారి మధ్యలో పనులు ఆగిన దృశ్యం

రోజుల్లో రూ.80 ఉంటే ప్రస్తుతం సిద్దిపేట నుంచి మెదక్ వెళ్లాలంటే నిజాంపేట వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి రామాయంపేట ఆటోలో ప్రయాణించాల్సి వస్తుంది. ఆటో వాలాలు చార్జిని రూ.100 చేశారు. నిజాంపేట నుంచి రామాయంపేట వరకు రూ.50 తీసుకుంటున్నారు. దీంతో సిద్దిపేట నుంచి మెదక్ వెళ్లాలంటే ఆర్థిక భారం పెరుగుతుంది. దీనికి అయ్యే ఖర్చు రూ.200 వరకు అవుతుంది. సమయం కూడా వృథా అవుతుంది. అధికారులు స్పందించి సిద్దిపేట నుంచి మెదక్ వరకు ప్రత్యామ్నాయ మార్గాలలో బస్సులు నడపాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ మార్గాల్లో బస్సులు నడపాలి



నేను పాపన్నపేటలో ఉద్యోగం చేస్తున్నా. ప్రతి రోజు పోతారెడ్డిపేట నుంచి మెదక్ వరకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాను. ఉద్యోగానికి వెళ్లాలంటే ప్రతి రోజు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తుంది. అలాగే సమయం కూడా వృథా అవుతుంది. బైక్‌పై వెళ్లాలంటే ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. కావునా అధికారులు స్పందించి సిద్దిపేట నుంచి మెదక్ వరకు బస్సులు నడపాలని కోరుకుంటున్నాం.

– రాజు, పోతారెడ్డిపేట, ప్రయాణికుడు

ఆయిల్‌పామ్‌తో అనేక లాభాలు

- సాగుకు రైతులు ముందుకు రావాలి
- ఏడీఏ సంధ్యారాణి, ఏఓ లావణ్య



శివ్వంపేటలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని ఏడీఏ సంధ్యారాణి, ఏఓ లావణ్య అన్నారు. గురువారం శివ్వంపేటలో ఆరు ఎకరాల్లో ఆయిల్ పామ్ మొక్కలు నాటే ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ఎకరం వరికి సరిపోయే నీటితో 4 ఎకరాల్లో పామ్ ఆయిల్ తోట సాగు చేసే అవకాశం ఉందన్నారు. రూ.200 విలువ గల మొక్కను ప్రభుత్వం సబ్సిడీపై రూ.20కు అందిస్తుందని చెప్పారు. పంట చేతికి వచ్చిన అనంతరం ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా కంపెనీ వారే ఆయిల్ పామ్ గెలలను కొనుగోలు చేస్తుందన్నారు. అటవీ జంతువులు, దొంగల బెడద లేకుండా సాగుకు అనుకూలమని చెప్పారు. డ్రిప్ పరికరాలు ఎస్సీ ఎస్టీ రైతులకు వంద శాతం, బీసీలకు 90 శాతం ఓసీ రైతులకు 80 శాతం సబ్సిడీపై అందివ్వనున్నట్లు తెలిపారు. రైతులకు రైతుబంధుతో పాటు సంవత్సరానికి రూ.4,200 ఎకరానికి సాగు ఖర్చుల కింద ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రవి వర్మ, మౌనిక, వినీత, కంపెనీ ప్రతినిధి అజయ్ కుమార్ ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

రామాయంపేట(మెదక్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని గురువారం ఏబీవీపీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు గురువారం బస్టాండు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర నాయకుడు ప్రశాంత్ మాట్లాడారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నిరుపేద విద్యార్థులు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధించడం విద్యార్థుల హక్కు అని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని ప్రశాంత్ హెచ్చరించారు. సంఘం నగర కార్యదర్శి అర్జున్ హాజరయ్యారు.

తప్పని యూరియా తిప్పలు



ఎనగండ్ల రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం రైతుల ఆందోళన



నిజాంపేటలో బారులు తీరిన రైతులు

కొల్చారం(నర్సాపూర్)/నిజాంపేట(మెదక్): రైతుల యూరియా కష్టాలు తీరడం లేదు. గురువారం వర్షంలో తడుస్తూ బారులుతీరారు. కొల్చారం మండలంలోని ఎనగండ్ల గ్రామానికి గురువారం 500 బస్తాల యూరియా రాగా, ఉదయం నుంచి టోకెన్ల కోసం రైతులు వర్షంలోనే రైతు వేదిక వద్ద ఆధార్ కార్డులు, పట్టాదార్ పాస్ పుస్తకాలతో పడిగాపులు కాశారు. ఎక్కువ మంది రైతులు రావడంతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే నిజాంపేట మండల కేంద్రంలో రైతులు వర్షంలోను యూరియా కోసం పడిగాపులు కాశారు. మండల కేంద్రంలోని ఆగ్రో సేవా కేంద్రంలో ఉదయం నుంచి రైతులు క్యూలో నిలబడ్డారు.

అవసరమైన యూరియా అందిస్తాం

ఏఓ కృష్ణ

పెద్దశంకరంపేట(మెదక్): రైతులకు అవసరమైన యూరియాను అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏఓ కృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు రామోజిపల్లి రైతువేదిక వద్ద రైతులకు 90 మెట్రిక్ టన్నుల యూరియాను అందించారు. మరో రెండు రోజులలో 50 మెట్రిక్ టన్నుల యూరియాను అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు అఖిల్, మమత, వినీత్ తదితరులున్నారు.

గోమారంలో ప్రభుత్వ భూమి సర్వే

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గోమారంలో విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావడంతో రెవెన్యూ, ఇరిగేషన్ సిబ్బంది గురువారం జాయింట్ సర్వే చేశారు. గ్రామ నడిబొడ్డున సర్వే నంబరు 539లోని 10 గుంటల ప్రభుత్వ భూమి, సర్వే నంబరు 538లోని పిత్తర్‌కుంటకు సంబంధించి 3 ఎకరాల శిఖం భూమి రికార్డు పరంగా ఉంది. పలువురు బడాభూస్వాములు కబ్జా చేసి సిమెంట్ పలకలతో ప్రహరీ నిర్మాణాలు, కట్టడాలు చేశారని గతంలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అందుకుగాను ఇరిగేషన్ డీఈ బుచ్చిబాబు, ఆర్ఐ కిషన్, సర్వేయర్ అరుణ్ కుమార్ కుంట శిఖం, ప్రభుత్వ భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేశారు. కొంత ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని గుర్తించినట్లు అధికారులు చెప్పారు. సదరు వ్యక్తులకు నోటీసులు జారీ చేసి సదరు భూమిని స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ఎమ్మెల్యేకు వినతి

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ గాంధీనగర్‌లోని డంపు యార్డ్‌ను మరోచోటుకు తరలించాలని కోరుతూ కాలనీ వాసులు గురువారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. డంపుయార్డ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలనీ మధ్య నుంచి మరో చోటుకు తరలించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ రత్నం, కాలనీవాసులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని రుక్మాపూర్‌లో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మురుగు కాల్వలు, వాటర్ ట్యాంక్‌లను పరిశీలించారు. మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి, సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **15న క్రీడా పాఠశాలకు ఎంపిక**

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 15న చేగుంటలోని గిరిజన బాలికల గురుకుల క్రీడా పాఠశాలకు విద్యార్థినులను ఎంపిక చేయనున్నట్లు ఆర్‌సీఓ గంగా రాంనాయక్, స్థానిక గిరిజన బాలికల మినీగురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 9వ తరగతి చదివే గిరిజన బాలికలు బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రంతో క్రీడాపోటీలకు హాజరు కావాలని చెప్పారు.

◆ **'పేట'లో మోస్తరు వర్షం**

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో మోస్తరు వర్షపాతం నమోదైంది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. సంత కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ వర్షంతో ఆరుతడి పంటలతో పాటు వరి పంటలకు మేలు చేకూరనుంది.

◆ **గిరిజన గురుకులలో ప్రవేశాలు**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంటలోని బాలికల గిరిజన క్రీడా పాఠశాలలో 6, 7, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ గంగారాం నాయక్ తెలిపారు. సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 15న చేగుంట గిరిజన గురుకులంలో అర్హత పరీక్ష నిర్వహించనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 6, 7, 9వ తరగతుల్లో చదువుతున్న గిరిజన విద్యార్థినులు బోనఫైడ్, కులధ్రువీకరణ పత్రంతో సకాలంలో హాజరు కావాలని కోరారు. సీట్లను భర్తీ చేసేందుకు దేహదారుఢ్య పరీక్షలను నిర్వహిస్తామన్నారు.

◆ **15న క్రీడా పాఠశాలకు ఎంపిక**

కౌడిపల్లి(నర్సాపూర్): ఈనెల 15న చేగుంటలోని గిరిజన బాలికల గురుకుల క్రీడా పాఠశాలకు విద్యార్థినులను ఎంపిక చేయనున్నట్లు ఆర్‌సీఓ గంగా రాంనాయక్, స్థానిక గిరిజన బాలికల మినీగురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఫణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 9వ తరగతి చదివే గిరిజన బాలికలు బోనాఫైడ్, కుల ధ్రువీకరణ పత్రంతో క్రీడాపోటీలకు హాజరు కావాలని చెప్పారు. ప్రతిభ, ఖాళీల ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

ఎంపీ రఘునందన్‌రావు



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

కౌడిపల్లి(నర్సాపూర్): గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసమైన ఘటనలో బాధిత కుటుంబానికి అండగా ఉంటామని ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. మండలంలోని ముత్రాజ్‌పల్లిలో గ్యాస్ సిలిండర్ పేలడంతో నష్టపోయిన మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. కలెక్టర్, హెచ్‌పీ గ్యాస్ కంపెనీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి బాధితుడికి నష్టపరిహారం త్వరగా ఇవ్వాలని, సొంత ఇల్లు మంజూరు చేయాలని సూచించారు. బాధితునికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు రాకేష్, బాలరాజు, నరేస్, అనిరుధ్, నందు తదితరులు పాల్గొన్నారు.

మనసున్న మహారాజులు

విద్యార్థులకు దాతల చేయూత



చిట్టోజిపల్లిలో విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తున్న జేబిటెక్ పరిశ్రమ సీఈఓ సీఎస్ఆర్ సభ్యులు

చేగుంట(తూప్రాన్): మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతలు తమకు తోచిన సహాయ సహకారం అందిస్తున్నారు. మండలంలోని చిట్టోజిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థులు చదువు కోసం చేగుంటకు నడుచుకుంటూ వస్తున్నారు. ఈ విషయం స్వయంగా చూసిన స్థానిక జేబిటెక్ ఇండియా ప్రైవేటు పరిశ్రమ సీఈఓ శివప్రసాద్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సీఎస్ఆర్ కమిటీ సభ్యులు విశ్వేశ్వర్‌రావు స్పందించారు. విద్యార్థులకు సైకిళ్లు అందించాలని నిర్ణయించుకున్నారు. చేగుంట, చిట్టోజిపల్లి నుంచి రెడ్డిపల్లి గ్రామాలకు నడుచుకుంటూ వెళుతున్న 32 మంది విద్యార్థులకు రూ.3లక్షల విలువ గల సైకిళ్లను అందించారు. చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు స్వచ్ఛమైన నీటిని తాగాలనే ఉద్దేశంతో భాగ్యనగర్ వైశ్య యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయించారు. కసాన్‌పల్లి, ఇబ్రహీంపూర్ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్థానిక స్వచ్ఛంద సంస్థల సభ్యులు విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను అందజేశారు. చెట్ల తిమ్మాయిపల్లి పాఠశాల విద్యార్థులకు జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ తరపున మైక్‌సెట్‌తో పాటు పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారు. పలు గ్రామాల్లో పరిశ్రమల నిర్వాహకులతో పాటు స్వచ్ఛంద సేవకులు ప్రభుత్వ విద్యార్థులకు సహకారం అందించడం పట్ల ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూనియర్లకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలి

- వైస్ ప్రిన్సిపాల్ సమీరా నజ్మీన్
- డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



ఫ్రెషర్స్ డేలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: జూనియర్లకు సీనియర్లు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సమీరా నజ్మీన్ పిలుపునిచ్చారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఏర్పరచుకొని విద్యను అభ్యసించాలని సూచించారు. అనంతరం కొత్త విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్లు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ బి.సురేష్ కుమార్, డాక్టర్ బి.రవికుమార్, రమేష్, ఎండీ ఖాజా ఆరిఫ్, శ్రీనివాస్, హేమంత్ కుమార్, మహేందర్ రెడ్డి, ఎస్.రాజు, రాములు, జానకి, యాదగిరి, అపర్ణ, చంద్రకళ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి తొట్టి నిర్మించాలి

కమిషనర్‌కు కాంగ్రెస్ నేతల వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: నర్సాపూర్‌లోని ఏడవ వార్డులో నీటి తొట్టి నిర్మించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని శివాలయం వద్ద బతుకమ్మ ఆడిన తర్వాత పక్కనే ఉన్న చెరువు కాలువలో వాటిని వదిలేశారని, ప్రస్తుతం చెరువు కాలువ లోకి మురికి నీరు చేరడంతో అందులో బతుకమ్మలు వదిలే పరిస్థితులు లేవన్నారు. మహిళలకు అనుకూలంగా ఉండే ప్రాంతంలో నీటి తొట్టి నిర్మించి రోజు నీటితో నింపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానని కమిషనర్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అజ్మత్అలీ, రషీద్, ఆంజనేయులుగౌడ్, రసన్, రవికుమార్, నరేందర్, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మిర్జాపల్లి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి



ఎంపీ రఘునందన్‌రావుకు వినతి పత్రం అందిస్తున్న గంగాధర్‌గౌడ్

ఎంపీకి బీజేపీ నేత గంగాధర్ గౌడ్ వినతి

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి రైల్వే ట్రాక్ డబుల్‌లైన్ నిర్మాణంతో పాటు గ్రామంలోకి వెళ్లేందుకు అవసరమైన అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఎంపీ రఘునందన్‌రావుకు బీజేపీ నేత గంగాధర్‌గౌడ్ వినతి పత్రం అందించారు. డబుల్‌లైన్ విస్తరణతో ప్రస్తుతం రాకపోకలు సాగిస్తున్న అండర్‌పాస్ బ్రిడ్జి పూర్తిగా చెరువు అంచునకు వెళ్లి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని తెలిపారు. గతంలో రైల్వేక్రాసింగ్ గేట్ ఉన్న ప్రాంతంలోనే నూతనంగా అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించనున్నట్లు ఎంపీ హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

కార్పొరేటర్ సింధు రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న సింధు రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ సింధు రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఆమె నివాసంలో డివిజన్ పరిధిలోని సమస్యలపై ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కాలనీలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో ప్రజల కోరిక మేరకు మౌలిక వసతులను కల్పిస్తున్నామని వివరించారు. మొదటి ప్రాధాన్యతగా రోడ్ల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కోరారు. అలాగే ఎల్ఐజీ, ఎంఐజీ కాలనీలలో సీసీ రోడ్లు, మ్యాక్ సొసైటీ కాలనీలో పనులకు వెంటనే ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, ఈఈ సురేష్, డీఈ దేవేందర్, ఏఈ ఫైజాన్ పాల్గొన్నారు.

రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

జహీరాబాద్: పట్టణంలోని చెన్నారెడ్డి నగర్ కాలనీలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభించారు. మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.5లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. చెన్నారెడ్డి నగర్ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. అయితే ఎట్టకేలకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంపై మున్సిపల్ అధికారులకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.